


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

ఆదివారం 30 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక : 89 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## తాష్కెంట్ చేరుకున్న ప్రధాని మోదీ.. మిర్జియోయేవ్‌తో కలిసి 'యాంగి ఉజ్బెకిస్తాన్' స్మారక చిహ్నం వద్ద నివాళులు





తాష్కెంట్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): ఉజ్బెకిస్తాన్‌లో రెండు రోజుల అధికారిక పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం తాష్కెంట్ చేరుకున్నారు. తాష్కెంట్-హుమో అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్ స్వయంగా ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికారు. ఇరు దేశాల జాతీయ పతాకాలను ఎగురవేసి, గౌరవ వందనంతో మోదీకి అధికారిక స్వాగతం అందించారు. ఈ సందర్భంగా ఉజ్బెకిస్తాన్ యువత హిందీలో రూపొందించిన ప్రత్యేక స్వాగత వీడియోపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఉజ్బెకిస్తాన్ యువ మిత్రులు చూపించిన ఉత్సాహం తనను ఎంతో ఆనందపరిచిందని, ముఖ్యంగా వారు హిందీలో ఎంతో చక్కగా ఆ వీడియో రూపొందించడం మరింత ప్రత్యేకంగా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. తాష్కెంట్ చేరుకున్న అనంతరం అధ్యక్షుడు మిర్జియోయేవ్‌తో కలిసి మోదీ 'యాంగి ఉజ్బెకిస్తాన్' పార్క్‌ను సందర్శించి, అక్కడి స్వాతంత్ర్య స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఉజ్బెకిస్తాన్ ప్రజల ఆకాంక్షలు, దేశ పురోగతికి ఈ స్మారక చిహ్నం ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. మోదీ పర్యటనలో భాగంగా ఆగస్టు 30న అధ్యక్షుడు మిర్జియోయేవ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాల విస్తరణపై చర్చలు జరగనున్నాయి. అలాగే 'వికసిత్ భారత్ 2047', 'ఉజ్బెకిస్తాన్-2030' అభివృద్ధి లక్ష్యాలపై ఇరు దేశాల నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. మోదీ తాష్కెంట్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి స్మారకాన్ని, మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ కిర్గిజ్ రిపబ్లిక్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లి ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. ఈ పర్యటన ద్వారా మధ్య ఆసియా దేశాలతో భారత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు భద్రత, అనుసంధానం, ఆర్థిక అవకాశాలు, ఉగ్రవాద నిర్మూలన, ప్రాంతీయ శాంతి, సుస్థిరత వంటి అంశాల్లో భారత పాత్రను మరింత విస్తరించాలన్న లక్ష్యంతో మోదీ పర్యటన కొనసాగుతోంది.

## మారుమూల ప్రాంతాలకు డ్రోన్లతో వైద్య సేవలు.. 21 ఆరోగ్య రథాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు





అరకులోయ, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వేగంగా అందించేందుకు సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల నుంచి డ్రోన్ల ద్వారా రక్త నమూనాలను సేకరించడం, అత్యవసర మందులు, వైద్య సామగ్రిని వేగంగా తరలించడం ద్వారా వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యవసర చికిత్సకు అవసరమైన మందులు, వైద్య సామగ్రిని డ్రోన్ల ద్వారా తరలించేలా ప్రతిపాదించిన ప్రాజెక్టును సీఎం పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఆస్పత్రులు, వైద్య విభాగాలతో అనుసంధానించే విధంగా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని, దీనిని మరింత సమర్థవంతంగా, వ్యవస్థీకృతంగా అమలు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తామని చంద్రబాబు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఆరోగ్య సేవలను మరింత వేగవంతం చేసి ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలను బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న సంజీవని ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా అరకులోయ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను అందించే ఆరోగ్య రథాల సేవలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా 21 అత్యాధునిక ఆరోగ్య రథాలను ప్రారంభించిన చంద్రబాబు నాయుడు, త్వరలోనే వీటి సేవలను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటి వద్దకే వైద్య సేవలను అందించడం ద్వారా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు వైద్య పరంగా మరింత భరోసా కల్పించడంతో పాటు అత్యవసర సమయాల్లో వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకుంటామని సీఎం పేర్కొన్నారు.






## ఓటు హక్కుకు భంగం కలగొద్దు.. ఎస్ఐఆర్‌పై ఈసీకి సీఎం రేవంత్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా, అనర్హులకు ఓటు హక్కు దక్కకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ఈసీ గణాంకాల ప్రకారం జూన్ 10, 2026 నాటికి తెలంగాణలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించారని సీఎం తెలిపారు. వీరిలో 45.19 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారిగా గుర్తించడం ఆందోళన కలిగించే అంశమన్నారు. డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, మరో 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం జరగలేదని, ఫలితంగా సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. తాత్కాలికంగా ఇంట్లో లేని వ్యక్తులను, శాశ్వతంగా నివాసం మారినవారిని ఒకే విధంగా పరిగణించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేందుకు సహాయం అందించాలని కోరారు. పాత ప్రాంతంలోని ఓటును తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను తప్పనిసరిగా పాటించాలని, లేదంటే పోలింగ్ రోజునే తమ ఓటు తొలగించబడిన విషయం తెలుసుకునే పరిస్థితి ఏర్పడుతుందని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, బహుళ నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంత ఓటర్లు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని అక్టోబర్ 19 నుంచి మార్చాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని సూచించారు. నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులకు పత్రాలు సమర్పించేందుకు మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కుటుంబ నమోదు ధ్రువపత్రంతో పాటు మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా ఆధారాలుగా అంగీకరించేలా జాబితాను విస్తరించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఒక్కో నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున అదనపు అధికారులను నియమించి వికేంద్రీకృత విచారణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం పారదర్శక చర్యలు తీసుకోవాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ కేంద్రాలు, గ్రామసభల నిర్వహణతో పాటు అవసరమైన పరిపాలనా సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి లేఖలో స్పష్టం చేశారు.



## చిన్న నీటిపారుదల వ్యవస్థను పునరుద్ధరించాలి.. సీఎం రేవంత్‌కు రైతు సంక్షేమ కమిషన్ నివేదిక

హైదరాబాద్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): తెలంగాణలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ఆధునిక సాంకేతిక యూనిట్లతో వ్యవస్థను పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి నివేదికను సమర్పించింది. కమిషన్ సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి ముఖ్యమంత్రితో సమావేశమై నివేదికలోని సిఫారసులను వివరించారు. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానించేలా కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని కమిషన్ సూచించింది. చెరువుల పూర్తి నీటిమట్టం సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి వాటిని పరిరక్షించాలని పేర్కొంది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత కీలకమని కమిషన్ స్పష్టం చేసింది. గత రెండేళ్లలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు విస్తరణ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు వంటి అంశాలపై మరింత దృష్టి సారించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కమిషన్‌కు సూచించారు. కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, రైతుల ఆదాయం పెంపు, నీటి వనరుల సమర్థ వినియోగం, వ్యవసాయ రంగ స్థిరీకరణకు ఉపయోగపడే సూచనలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

# జనసేన పేరుతో నకిలీ విరాళాల ప్రచారం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




అమరావతి, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): జనసేన పార్టీ పేరుతో సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న నకిలీ విరాళాల ప్రచారంపై ప్రజలు, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పార్టీ సూచించింది. జనసేన పార్టీ పేరుతో రూ.100 విరాళం ఇవ్వాలని, ఇందుకోసం క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లింపులు చేయాలని సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న సందేశం పూర్తిగా నకిలీదని స్పష్టం చేసింది. ఈ తరహా విరాళాల కోసం జనసేన పార్టీ ఎలాంటి సందేశాన్ని విడుదల చేయలేదని పేర్కొంది. ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియాలో కనిపించే ఇటువంటి సందేశాలను నమ్మి అందులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎలాంటి నగదు చెల్లింపులు చేయవద్దని హెచ్చరించింది. సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం ఉన్నందున గుర్తుతెలియని క్యూఆర్ కోడ్‌లు, అనుమానాస్పద చెల్లింపు లింక్‌ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. జనసేన పార్టీకి సంబంధించిన విరాళాలు, కార్యక్రమాలు, అధికారిక ప్రకటనల విషయంలో పార్టీ అధికారిక వేదికల్లో వెలువడే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా పరిగణించాలని కోరింది. నకిలీ సందేశాలను ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా, తప్పుడు ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పార్టీ విజ్ఞప్తి చేసింది.

# ఏపీలో రిలయన్స్ భారీ పెట్టుబడి.. రూ.2.73 లక్షల కోట్లతో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్ట్!

ఏలూరు, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): ఆంధ్రప్రదేశ్‌లో భారీ పారిశ్రామిక పెట్టుబడికి రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతిపాదన చేసింది. ఏలూరు జిల్లాలో దేశంలోనే తొలి సమగ్ర భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ (యూసీజీ) కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.2.73 లక్షల కోట్ల పెట్టుబడిని 30 ఏళ్ల కాలంలో దశలవారీగా పెట్టాలని సంస్థ ప్రతిపాదించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. చింతలపూడి, రేచర్ల బొగ్గు బ్లాకులను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ-వేలం ద్వారా రిలయన్స్ ఇటీవల దక్కించుకుంది. ఈ ప్రాజెక్టు అమలు అన్వేషణ ఫలితాలు, సాంకేతిక మరియు వాణిజ్య సాధ్యతపై ఆధారపడి ఉంటుంది. ప్రణాళిక ప్రకారం 2026 మూడో త్రైమాసికం నుంచి 2027 నాలుగో త్రైమాసికం వరకు అన్వేషణ, పైలట్ దశలో రూ.3,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. అన్వేషణ విజయవంతమైతే 2028-30 మధ్య అభివృద్ధి దశలో రూ.1.20 లక్షల కోట్లు, 2030 తర్వాత ఉత్పత్తి దశలో మరో రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టే ప్రతిపాదన ఉంది. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ విధానంలో భూమి లోతుల్లో ఉన్న, సంప్రదాయ పద్ధతుల్లో తవ్వడం ఆర్థికంగా సాధ్యం కాని బొగ్గును బయటకు తీయకుండా అక్కడికక్కడే గ్యాస్‌గా మార్చి సింథసిస్ గ్యాస్ (సింగ్యాస్)గా వినియోగిస్తారు. ఈ సింగ్యాస్ ద్వారా హైడ్రోజన్, మిథనాల్, అమ్మోనియా, సింథటిక్ సహజ వాయువు వంటి విలువైన ఉత్పత్తులను తయారు చేసే అవకాశం ఉంది. చింతలపూడి బ్లాక్ సుమారు 3,000 ఎకరాల్లో విస్తరించి ఉండగా, రేచర్ల బ్లాక్ సుమారు 5,500 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. రెండు బ్లాకుల్లో కలిపి సుమారు 3.13 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. ఈ నిల్వలు భూమికి 600 మీటర్లకుపైగా లోతులో ఉన్నట్లు అధికారులు తెలిపినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలైతే 3,000 నుంచి 5,000 వరకు ప్రత్యక్ష ఉద్యోగాలు, 20,000 నుంచి 35,000 వరకు పరోక్ష, అనుబంధ ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని రిలయన్స్ అంచనా వేసింది. దేశీయ బొగ్గు వనరులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం, దిగుమతి చేసుకునే ఇంధనాలు, రసాయనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం కూడా బొగ్గు గ్యాసిఫికేషన్‌ను ప్రోత్సహిస్తోంది. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ సామర్థ్యాన్ని సాధించాలన్న జాతీయ లక్ష్యంలో భాగంగా యూసీజీ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం ఇస్తోంది. అయితే ప్రాజెక్టు ప్రస్తుతం ప్రతిపాదన, అన్వేషణ దశలోనే ఉండటంతో పెట్టుబడి మొత్తం, ఉపాధి అవకాశాలు, రాష్ట్రానికి వచ్చే ఆదాయం వంటి అంశాలు తుది అమలు, వాణిజ్య సాధ్యత, ప్రభుత్వ అనుమతులపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల ఏపీ ప్రభుత్వానికి రూ.65 వేల కోట్ల ఆదాయం ఖాయమనే ప్రచారాన్ని ప్రస్తుతానికి నిర్ధారిత వాస్తవంగా పరిగణించలేమని నిపుణులు సూచిస్తున్నారు.

# మళ్లీ తెరపైకి వాల్మీకి కుంభకోణం.. రెండోసారి మంత్రి పదవికి బి. నాగేంద్ర రాజీనామా

బెంగళూరు, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): కర్ణాటకలో మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల అక్రమ మళ్లింపు వ్యవహారం మరోసారి రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ప్రణాళిక, గణాంకాల శాఖ మంత్రి బి. నాగేంద్ర ఆగస్టు 28న తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో వాల్మీకి కార్పొరేషన్ వ్యవహారంలో ఆయన రెండోసారి మంత్రి పదవికి రాజీనామా చేసినట్లయింది. 2024లో ఈ వివాదం వెలుగులోకి వచ్చిన సమయంలో నాగేంద్ర అప్పటి సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉండగా, ఆయన శాఖ పరిధిలోని వాల్మీకి కార్పొరేషన్ నిధుల నుంచి సుమారు రూ.89.63 కోట్లను అనధికారికంగా ఇతర ఖాతాలకు మళ్లించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ వ్యవహారం వెలుగులోకి రావడానికి కార్పొరేషన్ ఖాతాల సూపరింటెండెంట్ పి. చంద్రశేఖరన్ ఆత్మహత్య, ఆయన రాసిన ఆరోపణలతో కూడిన లేఖ ప్రధాన కారణమైంది. అనంతరం కర్ణాటక పోలీసులు, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులు చేపట్టాయి. ఈడీ 2024లో దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో బి. నాగేంద్రను ప్రధాన నిందితుడిగా పేర్కొంది; అయితే ఈ ఆరోపణలపై న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోంది. ఈడీ ప్రకారం మళ్లించిన నిధుల్లో కొంత మొత్తాన్ని ఎన్నికల సంబంధిత ఖర్చులకు వినియోగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నేపథ్యంలో 2024 జూన్‌లో నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఆయనపై ఉన్న ఆరోపణలు రాజకీయంగా కొనసాగుతున్నప్పటికీ, 2026 ఆగస్టు 3న డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రివర్గంలో నాగేంద్రకు మళ్లీ చోటు కల్పించి ప్రణాళిక, గణాంకాల శాఖను అప్పగించారు. ఆయన పునర్నియామకంపై ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ఈ అంశంపై కర్ణాటక శాసనసభలోనూ, వెలుపల కూడా ప్రతిపక్షాలు ఆందోళనలు నిర్వహించాయి. బీజేపీ నాగేంద్ర రాజీనామాను డిమాండ్ చేస్తూ ఆగస్టు 24న బెంగళూరులో నిరసన చేపట్టగా, సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాయచూరు నుంచి బళ్లారి వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 28న నాగేంద్ర తన రాజీనామాను ప్రకటించారు. తాను స్వచ్ఛందంగానే రాజీనామా చేస్తున్నానని, తన వల్ల పార్టీకి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తనపై రాజకీయ కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, వాల్మీకి కార్పొరేషన్ నిధుల లావాదేవీల్లో తన సంతకం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. మరోవైపు ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నాగేంద్ర నిర్దోషి అని, ప్రతిపక్షాల ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గలేదని, పార్టీకి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే ఆయన రాజీనామా చేశారని పేర్కొన్నారు. దీంతో వాల్మీకి కార్పొరేషన్ నిధుల వ్యవహారం కర్ణాటక రాజకీయాల్లో మరోసారి ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

# పాక్ హ్యాండర్లకు భారత సిమ్ కార్డుల సరఫరా.. అనూప్‌గఢ్‌లో బల్విందర్ సింగ్ అరెస్ట్

అనూప్‌గఢ్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న హ్యాండ్లర్లకు భారత సిమ్ కార్డులు సరఫరా చేసి, వాటితో పాకిస్థాన్‌లో భారత మొబైల్ నంబర్లపై వాట్సాప్ ఖాతాలను సక్రియం చేయించేందుకు సహకరించాడన్న ఆరోపణలపై రాజస్థాన్‌లోని అనూప్‌గఢ్‌కు చెందిన బల్విందర్ సింగ్ అలియాస్ బింద్రాను పోలీసులు, సీఐడీ ఇంటెలిజెన్స్ విభాగం సంయుక్తంగా అరెస్ట్ చేశారు. శ్రీగంగానగర్ జిల్లా పోలీసుల పర్యవేక్షణలో అనూప్‌గఢ్ పోలీసులు, సీఐడీ ఇంటెలిజెన్స్ బృందాలు చేపట్టిన నిఘా చర్యల్లో నిందితుడి కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పోలీసుల ప్రకారం భారత పౌరుల పేర్లతో పొందిన సిమ్ కార్డులను పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు చేరవేసినట్లు బల్విందర్‌పై ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆ సిమ్ కార్డులకు పంపిన ఓటీపీ ద్వారా పాకిస్థాన్‌లో భారత నంబర్లతో వాట్సాప్ ఖాతాలను సక్రియం చేసి, భారత్‌లోని వ్యక్తులతో సంప్రదింపులు జరపడంతో పాటు దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సేకరించేందుకు వాటిని ఉపయోగించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించి, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న హ్యాండ్లర్లతో అతనికి ఉన్న సంబంధాలు, ఇతర వ్యక్తుల ప్రమేయం, సరిహద్దు దాటి కొనసాగుతున్న నెట్‌వర్క్ వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. బల్విందర్ సింగ్‌పై అనూప్‌గఢ్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, జైత్సర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మాదకద్రవ్యాల కేసులోనూ నిందితుడు వాంటెడ్‌గా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ కేసులో పాకిస్థాన్ నుంచి డ్రోన్ ద్వారా భారత్‌లోకి చేరవేసినట్లు అనుమానిస్తున్న సుమారు 10.5 కిలోల హెరాయిన్, దాని విలువ సుమారు రూ.55 కోట్లుగా అంచనా వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో బల్విందర్ సింగ్ ఆచూకీ కోసం రూ.25 వేల రివార్డు ప్రకటించినట్లు తెలిపారు. దీంతో గూఢచర్య ఆరోపణలు, సిమ్ కార్డుల అక్రమ సరఫరా, సరిహద్దు మాదకద్రవ్యాల అక్రమ రవాణా మధ్య సంబంధాలపై దర్యాప్తు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.



# సకాలంలో వైద్యం అందక ఏడేళ్ల చిన్నారి మృతి.. నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రిలో విషాదం

నారాయణపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకట్రాములు కుమార్తె చైత్ర (7) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా, శనివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఉదయం 4 గంటల సమయంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. దాదాపు ఐదు గంటల పాటు వైద్యం కోసం ఎదురుచూసినా వైద్యులు సకాలంలో స్పందించలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. చిన్నారి పరిస్థితి మరింత విషమించడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తిరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అక్కడికి తీసుకొచ్చిన కొద్దిసేపటికే చిన్నారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. తమ కుమార్తెకు సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయిందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. వైద్యులు కనీసం పరీక్షించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే చిన్నారి మృతికి అసలు కారణం, ఆస్పత్రిలో వైద్య సేవల విషయంలో ఏదైనా నిర్లక్ష్యం జరిగిందా అనే అంశాలపై అధికారికంగా సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యతలు ఎవరివైనా తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.




# కుడి కాలువకు నీళ్లిస్తే.. ఎడమ కాలువ రైతులకు ఎందుకు ఇవ్వరు?: జగదీష్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): నాగార్జునసాగర్ కుడి కాలువకు నీటి విడుదల విషయంలో ఆంధ్రప్రదేశ్ మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి నీటి కోసం పట్టుబడుతున్నారని, అదే సమయంలో తెలంగాణలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఉన్న రైతులకు సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి. జగదీష్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. కుడి కాలువకు నీటిని విడుదల చేసే విషయంలో చొరవ చూపుతున్న ఏపీ ప్రజాప్రతినిధులు తమ ముఖ్యమంత్రిని కలిసి సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, తెలంగాణలో మాత్రం ఎడమ కాలువ కింద ఉన్న రైతుల సమస్యపై మంత్రులు స్పందించడం లేదని మండిపడ్డారు. కుడి కాలువకు నీరు విడుదల చేయడంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అధికారుల మధ్య ఇటీవల వివాదం చోటుచేసుకున్న నేపథ్యంలో జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నుంచి ముందస్తు అనుమతి లేకుండానే ఏపీ అధికారులు నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేశారని తెలంగాణ అధికారులు ఆరోపించగా, తాగునీటి అవసరాల కోసమే నీటిని తీసుకున్నామని ఏపీ అధికారులు పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ అధికారులు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఉన్న రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని జగదీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు నీటి కేటాయింపులపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను కాపాడే విధంగా వ్యవహరించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రైతాంగం నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, నాగార్జునసాగర్ జలాశయంలో నీటి లభ్యత, కుడి–ఎడమ కాలువలకు నీటి కేటాయింపులపై రెండు రాష్ట్రాల అధికారుల మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# నిషేధిత జాబితా నుంచి 50,565 ఎకరాలను తొలగించాలి: హరీశ్‌రావు




సంగారెడ్డి, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): సంగారెడ్డి జిల్లాలో నిషేధిత జాబితాలో చేర్చిన 50,565 ఎకరాల భూములను వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో భూములను చేర్చడం వల్ల ఆయా భూముల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో చేర్చిన 50,565 ఎకరాల భూములపై సమగ్రంగా పరిశీలన జరిపి, అర్హత ఉన్న భూములను వెంటనే జాబితా నుంచి తొలగించాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే బాధితులతో కలిసి సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. భూ యజమానులకు న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.



## కోదాడ సీఐపై గ్రామస్థుల రాళ్లదాడి.. ఎర్రగట్టుతండాలో ఉద్రిక్తత

సూర్యాపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగట్టుతండాలో చోటుచేసుకున్న హత్య ఘటన నేపథ్యంలో గ్రామానికి వెళ్లిన కోదాడ సీఐపై కొందరు గ్రామస్థులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వేపచెట్టు విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో రామ్‌నాయక్ అనే వ్యక్తి తన తండ్రితో పాటు ప్రత్యర్థి వర్గానికి చెందిన మరో వ్యక్తిని నరికి హత్య చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు పోలీసులు గ్రామానికి వెళ్లగా, కోదాడ సీఐపై కొందరు గ్రామస్థులు తిరగబడి రాళ్లు విసిరినట్లు తెలిసింది. ఇటీవల కోదాడ పట్టణంలోని 32వ వార్డులో తమ దుకాణాలను అక్రమంగా తొలగించారని ఆరోపిస్తూ నిరసనకు దిగిన బాధితులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై కూడా స్థానికంగా అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. బాధితులను పోలీసులు తోసివేసి, కాలర్ పట్టుకుని ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేశారని వారు ఆరోపిస్తున్నారు. అయితే పోలీసులపై రాళ్లదాడి ఘటనకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్లు సమాచారం. రెండు ఘటనలకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించే అవకాశం ఉంది.

## గురుకులంలో 5వ తరగతి విద్యార్థినికి పాము కాటు.. ఎంజీఎంకు తరలింపు



వరంగల్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థినిని పాము కాటేసిన ఘటన కలకలం రేపింది. గురుకులంలో ఉన్న సమయంలో విద్యార్థినిని పాము కాటేయడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆమెను వర్ధన్నపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితిని పరిశీలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినికి వైద్యులు చికిత్స అందిస్తూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఘటనపై గురుకుల సిబ్బంది, విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గురుకుల ఆవరణలో పాముల సంచారాన్ని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



## సకల సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం.. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు: మంత్రి పొంగులేటి

సూర్యాపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో రూ.1.40 కోట్ల అంచనా వ్యయంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి, సూర్యాపేట మున్సిపాలిటీలో రూ.2.10 కోట్లతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రెవెన్యూ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏళ్ల తరబడి పురాతన భవనాల్లో కొనసాగుతున్న తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఆర్డీవో కార్యాలయాలను ఆధునిక సౌకర్యాలతో నూతన భవనాల్లోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలు వివిధ రెవెన్యూ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పిస్తూ ప్రభుత్వ కార్యాలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఒకే భవన సముదాయంలో వివిధ రెవెన్యూ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలను కొనసాగిస్తోందని వెల్లడించారు.



## భూ సమస్యలకు భూ భారతి శాశ్వత పరిష్కారం.. ఏడాదిలో ప్రతి అంగుళం భూమికి సమగ్ర సర్వే: మంత్రి పొంగులేటి

సూర్యాపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, రానున్న ఏడాది కాలంలో వివాదరహిత భూముల ప్రతి అంగుళాన్ని సమగ్రంగా సర్వే చేసి అర్హులైన భూ యజమానులకు పట్టాదారు పాస్‌బుక్స్ అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రంలో నూతన్‌కల్, మద్దిరాల మండలాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ 15 గ్రామాలకు చెందిన 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలకు పరిష్కారం చూపే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. భూమిపై హక్కు ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో హక్కు నమోదు కాక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తరతరాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేసి, వాస్తవంగా భూమిని అనుభవిస్తున్న అర్హులైన రైతుల హక్కులను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రానున్న ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర సర్వే నిర్వహించి, వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌బుక్స్ అందించడంతో పాటు అర్హత ఉన్న ప్రతి భూ యజమానికి న్యాయం చేస్తామని పునరుద్ఘాటించారు. భూమిపై చట్టబద్ధమైన హక్కు రైతుకు ఆర్థిక భరోసాను కల్పిస్తుందని, భూ హక్కుల రికార్డులు సక్రమంగా ఉంటే బ్యాంకు రుణాలు, రైతు సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను రైతులు సులభంగా పొందగలుగుతారని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. రైతులకు న్యాయం చేయడం, పేదలకు ఇళ్లు కల్పించడం, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలని తెలిపారు. గడిచిన రెండున్నరేళ్లలో మహిళలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, రానున్న కాలంలోనూ ఇదే విధంగా ఆర్థిక సహకారం కొనసాగిస్తామని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, హైదరాబాద్‌లో విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు గృహ వసతి కల్పించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి తొలి విడతగా 3,500 ఇళ్లు, రెండో విడతగా 2,000 ఇళ్లు మంజూరు చేశామని, తదుపరి విడతల్లోనూ అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



## పదేళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం: మంత్రి పొంగులేటి

నూతన్‌కల్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): భూములు ఉన్నప్పటికీ పట్టాలు లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్న రైతుల సమస్యలను పరిష్కరించి పట్టాదారు పాస్‌బుక్స్ అందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నూతన్‌కల్, మద్దిరాల మండలాలకు చెందిన రైతులకు పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గత పాలకుల హయాంలో తమ భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఉన్నప్పటికీ పట్టాలు లేక తమ పిల్లల వివాహాలు సైతం చేయలేని పరిస్థితి ఎదురైందని కొందరు రైతులు పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించి పట్టాదారు పాస్‌బుక్స్ అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నూతన్‌కల్, మద్దిరాల మండలాల్లో 1,921 మంది రైతులకు సంబంధించిన భూ సమస్యలను గత ప్రభుత్వం పరిష్కరించలేదని మంత్రి పొంగులేటి ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించి రైతులకు పట్టాదారు పాస్‌బుక్స్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో సమగ్ర భూ సర్వే నిర్వహించనున్నామని, ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియ ప్రారంభించామని చెప్పారు. భూముల హక్కులు, సరిహద్దులు, రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. భూ రికార్డులు సక్రమంగా ఉంటే రైతులకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలను దశలవారీగా పరిష్కరించి రైతులకు భద్రమైన భూ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



## వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి: మంత్రి దామోదర్

హైదరాబాద్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ నాటికి వైద్య సేవలు అందించేలా ఆస్పత్రిని సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. టిమ్స్ అల్వాల్, టిమ్స్ ఎల్బీనగర్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిపై శనివారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ ఆస్పత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, అక్టోబర్ నాటికి అన్ని నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఆర్అండ్బీ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఎక్స్‌రే, సీటీ స్కాన్ తదితర అవసరమైన వైద్య పరికరాల ఏర్పాటు కొనసాగుతోందని, ఈ ప్రక్రియ సెప్టెంబర్‌లో పూర్తవుతుందని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అక్టోబర్ చివరి నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి, నవంబర్ నుంచి ట్రయల్ రన్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. వైద్యుల నిపుణుల కమిటీ ప్రతి 15 రోజులకు ఒకసారి ఆస్పత్రిని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు అవసరమైన సూచనలు చేయాలని, ఆర్అండ్బీ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ వైద్య సేవలకు అనువైన విధంగా ఆస్పత్రిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరి నాటికి అల్వాల్ టిమ్స్, 2027 మార్చి నాటికి ఎల్బీనగర్ టిమ్స్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఆర్అండ్బీ అధికారులు మంత్రికి తెలిపారు. ఆస్పత్రి నిర్మాణంతో పాటు వైద్య సేవలకు అవసరమైన నీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్అండ్బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్.చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక, మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్ మనూ చౌదరి, రంగారెడ్డి అదనపు కలెక్టర్ కిరణ్మయి, ఆర్అండ్బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు చింతకాని చేరిన పాదయాత్ర

చింతకాని, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ఖమ్మం జిల్లా స్థాయి పాదయాత్ర శనివారం చింతకాని మండల కేంద్రానికి చేరుకుంది. స్థానిక ముత్యాలమ్మ గుడి సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. పాదయాత్రకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్, మత్స్యపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ ప్రాంతానికి చేరుకున్న పాదయాత్రకు బీఆర్ఎస్ నాయకులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మంకెన రమేష్, గురజాల హనుమంతరావు, గడ్డం రమణతో పాటు పలువురు సర్పంచులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించడం న్యాయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం పాదయాత్ర తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, స్థానిక జర్నలిస్టులు తహసీల్దార్ కరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రభుత్వానికి తమ విజ్ఞప్తిని తెలియజేయాలని తహసీల్దార్‌ను కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి తేనే వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టీబీజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు నలబోల మధుశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఎస్. చక్రవర్తి, రాష్ట్ర నాయకుడు మారెడ్డి నాగేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుపాటి మాధవరావు, జానీ పాషా, కొరకొప్పుల రాంబాబు, గుడిమెట్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. టీబీజేఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్యా గణేష్, కోశాధికారి యూసఫ్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అర్షద్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, తిరుపతిరావు, ఎండి షకీల్ మహ్మద్, సామ్రాట్ గుప్తా, కెదాసి కిరణ్‌కుమార్‌తో పాటు మండలంలోని పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.. ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలి: మంత్రి దామోదర్



హైదరాబాద్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక): వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల పరిస్థితి, వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, ప్రభుత్వ ఆస్పత్రుల సంసిద్ధత, ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా తదితర సీజనల్ వ్యాధుల పరిస్థితి, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నమోదైన కేసులు, జిల్లాల వారీగా పరిస్థితి, జ్వర సర్వేలు, దోమల నియంత్రణ చర్యలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల పనితీరుపై అధికారులు మంత్రికి వివరించారు. 2026 జనవరి 1 నుంచి ఆగస్టు 27 వరకు నమోదైన కేసులను గత ఏడాది ఇదే కాలంతో పోల్చగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, అక్యూట్ డయేరియల్ డిసీజ్, డిసెంట్రీ కేసులు తగ్గినట్లు అధికారులు తెలిపారు. అయితే టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగినట్లు వివరించారు. కేసులు అధికంగా నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స అందించడం కంటే ముందస్తు చర్యల ద్వారా వాటి వ్యాప్తిని అరికట్టడమే ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. అన్ని జిల్లాల ఆరోగ్య యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర కేసులు పెరుగుతున్న జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత ముమ్మరం చేయాలని, అధిక ప్రమాద ప్రాంతాలు, గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, వసతి గృహాలు, నిర్మాణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉన్నతాధికారులు జిల్లాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జ్వర సర్వేలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తూ, సర్వేలో గుర్తించిన ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించాలని, అవసరమైన వారికి సకాలంలో పరీక్షలు, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉంచి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. సాధారణ జ్వరం, డెంగ్యూ, మలేరియా లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలతో ఆస్పత్రులకు వచ్చే వారికి ఆలస్యం లేకుండా పరీక్షలు నిర్వహించి తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఢిల్లీ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా, స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఇన్‌ఫ్లూయెంజా తరహా అనారోగ్య కేసులపై మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న ఇటువంటి కేసుల వివరాలను ప్రతిరోజూ పర్యవేక్షించి, వారానికి ఒకసారి నివేదిక సమర్పించాలని సూచించారు. అవసరమైన పరీక్షలకు రసాయనిక పదార్థాలు సిద్ధంగా ఉన్నాయని, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పరిస్థితి నియంత్రణలోనే ఉందని అధికారులు తెలిపారు. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో దోమల నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే 'డ్రై డే' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు నిల్వ నీటి తొలగింపు, దోమల లార్వా నిర్మూలన, మందుల పిచికారీ, ప్రత్యేక జ్వర సర్వేలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, వసతి గృహాలు, నిర్మాణ ప్రాంతాలు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీరాజ్, విద్య, మహిళా శిశు సంక్షేమం, రెవెన్యూ తదితర శాఖలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి పారిశుద్ధ్యం, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు పూర్తిస్థాయిలో పనిచేస్తూ ఎక్కడైనా వ్యాధుల సమూహ కేసులు గుర్తించిన వెంటనే స్పందించి వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులు, యాంటీ మలేరియల్ మందులు, లార్విసైడ్లు, క్రిమిసంహారక మందులు, మలేరియా వేగవంత నిర్ధారణ కిట్లు, డెంగ్యూ, చికున్‌గున్యా పరీక్షా కిట్లు తదితర సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని, ప్రతి కేసును అప్రమత్తంగా పర్యవేక్షిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి వైద్యుల సూచన మేరకు పరీక్షలు, చికిత్స పొందాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సమీక్షలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టి.. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కార్యాచరణ

సంగారెడ్డి, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): జిల్లాలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థి నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలను సాధించేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ సమీక్ష సమావేశంలో కార్యక్రమం అమలు తీరు, విద్యార్థుల అభ్యసన స్థాయులు, పాఠశాలల పనితీరు, మూల్యాంకన ఫలితాలను కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని 254 ఎఫ్ఎల్ఎన్ పాఠశాలల్లో విద్యార్థులందరూ నిర్దేశిత సామర్థ్యాలను సాధించేలా పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలని, ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యాలను చేరుకునే విధంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మూల్యాంకన ఫలితాల ఆధారంగా విద్యార్థుల్లోని అభ్యసన లోపాలను గుర్తించి వాటి నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని, తెలుగు, ఆంగ్లం, గణితం అంశాల్లో ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండలంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు ఆకస్మిక మూల్యాంకనాలు నిర్వహించాలని, పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి స్థాయికి అనుగుణంగా బోధనా పద్ధతులను అనుసరించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, పాఠశాలల్లో లక్ష్య నిర్ధారణ పోస్టర్లు ఏర్పాటు చేసి లక్ష్యాల సాధనపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పర్యవేక్షణ బృందాలు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి ఎఫ్ఎల్ఎన్ అమలును పరిశీలించాలని, తక్కువ స్థాయి ఫలితాలు నమోదవుతున్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాల ద్వారా ఎఫ్ఎల్ఎన్ ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల అభ్యసన పురోగతిని వారికి తెలియజేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి అవసరమైన ప్రాథమిక సామర్థ్యాలు అందేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమా హారతి, జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి, జిల్లా సమగ్ర శిక్షణ సమన్వయకర్త బాలయ్య, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పర్యవేక్షణ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్




సంగారెడ్డి, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నోటీసులు అందజేసిన అనంతరం తప్పనిసరిగా స్వీకరణ ధ్రువీకరణ పొందాలని సూచించారు. శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియపై ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నోటీసుల పంపిణీ, విచారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలని, సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలిపారు. అనంతరం నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని మరింత వేగవంతం చేయాలని ఎన్నికల నమోదు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ఠ సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసి, ప్రతి నోటీసుకు తప్పనిసరిగా స్వీకరణ ధ్రువీకరణ పొందాలని సూచించారు. పోలింగ్ కేంద్రం, మండలాల వారీగా నోటీసుల పంపిణీ పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని, పంపిణీ పెండింగ్‌లో అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టి మిగిలిన నోటీసుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది అదనపు కలెక్టర్ పాండు

సంగారెడ్డి, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ పాండు హాజరై మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు కేవలం వినోదం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యం, ఉల్లాసం, ఆహ్లాదంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జాతీయ స్థాయి క్రీడాకారుడు మహమ్మద్ జావిద్ అలీ మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా ప్రతిభను, హాకీ రంగంలో ఆయన భారతదేశానికి సాధించి పెట్టిన ఘనతను వివరించారు. మరో గౌరవ అతిథి కూన వేణు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన కొర్రరాజు, జాడో చరణ్, కె. గీతలను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ హాకీ కోచ్ సాయికుమార్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి. శంకర్, రెజ్లింగ్ కోచ్ జైపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గ ప్రసాద్, సుభాష్ గౌడ్, రామకృష్ణ, రామ గౌడ్, కృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, కరాటే సంఘం ప్రతినిధి చవాన్ చందర్, బాక్సింగ్ సంఘం ప్రతినిధి మహేష్, రెజ్లింగ్ సంఘం ప్రతినిధి విట్టల్ నాయక్‌తో పాటు ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యాప చెట్టు వివాదం.. ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరు మృతి



సూర్యాపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న యాప చెట్టు వివాదం ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసి ఇద్దరు మృతి చెందారు. స్థానిక సమాచారం ప్రకారం చెట్టు విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, పరస్పరం గొడ్డళ్లతో దాడులు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో మంద వెంకటేశ్వర్లు యాదవ్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, సైదా అనే మరో వ్యక్తిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సమాచారం. ఘటన అనంతరం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా పెద్దబాబు కుటుంబంపై గ్రామస్తులు దాడికి దిగినట్లు సమాచారం. పరిస్థితిని అదుపు చేసేందుకు అడ్డుగా వెళ్లిన మేళ్లచెరువు ఎస్సై నవీన్‌కుమార్‌కు కూడా గాయాలైనట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఘర్షణకు దారితీసిన కారణాలు, నిందితులపై తీసుకున్న చర్యలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

## కోదాడలో రేపు పట్టణ బంద్‌కు పిలుపు




సూర్యాపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): కోదాడ పట్టణంలో నిరుపేద మహిళ గంధం కనకమ్మపై టౌన్ సీఐ వ్యవహరించిన తీరును నిరసిస్తూ ఆగస్టు 31న కోదాడ పట్టణ బంద్ నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా పాన్ డబ్బా నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న కనకమ్మపై అధికార బలంతో అమానుషంగా వ్యవహరించారని ఆరోపిస్తూ, సంబంధిత సీఐను విధుల నుంచి సస్పెండ్ చేయాలని, బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 31న నిర్వహించనున్న కోదాడ పట్టణ బంద్‌కు పట్టణ, నియోజకవర్గ ప్రజలు, మేధావులు, పుర ప్రముఖులు, వర్తక-వాణిజ్య సంస్థల యజమానులు, వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్, మెదక్ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో పురుషులకు 5 కిలోమీటర్లు, బాలికలకు 2 కిలోమీటర్ల పరుగు పోటీలను నిర్వహించారు. వెల్కమ్ బోర్డు చౌరస్తా నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు పురుషుల 5 కిలోమీటర్ల పరుగు, మెదక్ కొత్త బస్టాండ్ నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు బాలికల 2 కిలోమీటర్ల పరుగును జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, మెదక్ జిల్లాలోనూ ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని, విద్యార్థులు, క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు జుబేర్ అహ్మద్, ఫౌండేషన్ చైర్మన్ శివ, డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్ తదితరులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, క్రీడాభిమానులను ఉద్దేశించి పలువురు వక్తలు ప్రసంగించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, సమష్టి భావన పెంపొందించడమే లక్ష్యంగా పరుగు పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా పతకాలను అందజేశారు. 5 కిలోమీటర్ల పరుగు పోటీలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసిన క్రీడాకారులతో పాటు పట్టణ సీఐ మహేష్ క్రీడాకారులు, క్రీడాభిమానుల్లో స్ఫూర్తి, ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, మెదక్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి నాగరాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం, ఫుట్‌బాల్ కోచ్ వినయ్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర నియోజకవర్గంలో సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ నిరసనలు



సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ ఆగస్టు 30: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముదిగొండ మండలం చిరుమర్రి గ్రామంలో, చింతకాని మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి విస్తృత సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 420 హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించిన ఆయన, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వారం రోజులపాటు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముదిగొండ, చింతకాని మండలాల్లోనూ నిరసన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని కమల్‌రాజు తెలిపారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో మండల పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు చింతకాని చేరిన పాదయాత్ర

సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 30: రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ఖమ్మం జిల్లా స్థాయి పాదయాత్ర ఆదివారం చింతకాని మండల కేంద్రానికి చేరుకుంది. స్థానిక ముత్యాలమ్మ గుడి సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్రలో స్థానిక జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతానికి చేరుకున్న పాదయాత్రకు బీఆర్ఎస్ నాయకులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మంకెన రమేష్, గురజాల హనుమంతరావు, గడ్డం రమణతో పాటు పలువురు సర్పంచులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం న్యాయమైన డిమాండ్ అని, రాష్ట్రంలోని అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం పాదయాత్ర తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు, స్థానిక జర్నలిస్టులు తహసీల్దార్ కరుణశ్రీకి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా తమ విజ్ఞప్తిని ప్రభుత్వానికి తెలియజేయాలని తహసీల్దార్‌ను కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానిక జర్నలిస్టులు ఇంటి ప్రసాద్, ఎన్నబోయిన సురేందర్, గడ్డం విజయ్, శెట్టి సురేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి తేనే వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టీబీజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు నలబోల మధుశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఎస్. చక్రవర్తి, రాష్ట్ర నాయకుడు మారెడ్డి నాగేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుపాటి మాధవరావు, జానీ పాషా, కొరకొప్పుల రాంబాబు, గుడిమెట్ల మోహన్‌రావు, టీబీజేఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్యా గణేష్, కోశాధికారి యూసఫ్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అర్షద్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, తిరుపతిరావు, ఎండి షకీల్ మహ్మద్, సామ్రాట్ గుప్తా, కెదాసి కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు శిక్షణ అంశాలను సమర్థంగా అమలు చేయాలి

అందోల్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ ప్రతినిధి: అందోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాలను ఎంఈవో కృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే బోధనలో నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు కాంప్లెక్స్ సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ, నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఎంఈవో కృష్ణ సూచించారు.



## పాఠశాల గ్రాంట్లు అందుబాటులోకి రాక ఇబ్బందులు

ఉమ్మడి మెదక్ జిల్లా, ఆగస్టు 30, సందేశం టైమ్స్: 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు కాంపోజిట్ స్కూల్ గ్రాంట్లు మంజూరైనప్పటికీ, ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొన్ని పాఠశాలలకు నిధులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో నిర్వహణ పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ రోజువారీ అవసరాలు, చిన్నపాటి నిర్వహణ ఖర్చులు, శుభ్రత, బోధన సామగ్రి, చిన్నపాటి మరమ్మతులు తదితర అవసరాలను తీర్చేందుకు కొంతమంది ప్రధానోపాధ్యాయులు సొంతంగా డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల నిర్వహణలో కాంపోజిట్ స్కూల్ గ్రాంట్లు కీలకంగా ఉపయోగపడతాయని, ప్రభుత్వం 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాంట్ల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ, కొన్ని పాఠశాలల్లో నిధుల వినియోగానికి సంబంధించిన సమస్యలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. సంబంధిత అధికారులు ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి, మంజూరైన గ్రాంట్ నిధులు పాఠశాలలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.




## త్రిబుల్ ఆర్ భూసేకరణలో మెదక్ జిల్లా అధికారుల సమన్వయం ప్రశంసనీయం

మెదక్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణ ప్రక్రియలో మెదక్ జిల్లా రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారుల సమన్వయం ప్రశంసనీయమని ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ ఐఏఎస్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో ఆర్ఆర్ఆర్ భూసేకరణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలను అడిగి భూసేకరణ ప్రక్రియ పురోగతిని అధికారులు తెలుసుకున్నారు. ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్ఆర్ఆర్ భూసేకరణపై జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నామని, ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో మెదక్ జిల్లాలో భూసేకరణ ప్రక్రియ మంచి పురోగతిలో ఉందని తెలిపారు. అవార్డులు జారీ చేసిన భూముల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు రైతులకు పరిహారం చెల్లింపులు సకాలంలో జరిగేలా తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించేలా చర్యలు చేపడుతున్నామని, అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా ఆర్ఆర్ఆర్ నిర్మాణ పనులను త్వరగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. భూసేకరణ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, భూసేకరణ కన్సల్టెంట్ సుందర్ అద్నాన్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి, జాతీయ రహదారుల మేనేజర్ రాహుల్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తూప్రాన్ ఆర్డీవో బావయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ గఫర్, మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

మెదక్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ ప్రతినిధి: మెదక్ జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సాధించే దిశగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) స్థాయిలో గోదాముల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అధికారి పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్య నిల్వల పథకంలో భాగంగా జిల్లాలో అనువైన పీఏసీఎస్‌లను గుర్తించి గోదాముల నిర్మాణంతో పాటు అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్య నిల్వ సామర్థ్య లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. పీఏసీఎస్ స్థాయిలో గోదాములు అందుబాటులోకి వస్తే రైతులు స్థానికంగానే ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం కలుగుతుందని, పంటను వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి తగ్గడంతో పాటు ధాన్య నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎల్దుర్తి, రంగంపేట పీఏసీఎస్‌లలో గోదాముల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించడంతో పాటు ఎఫ్ఎస్‌సీఎస్ కొత్తపల్లి, పీఏసీఎస్ కల్వకుంట, పీఏసీఎస్ చీకోడు సంస్థలకు గోదాముల నిర్మాణం కోసం భూ కేటాయింపు అంశంపై చర్చించారు. సంబంధిత శాఖల సమన్వయంతో భూ కేటాయింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గోదాముల నిర్మాణానికి సంబంధించి భారత ఆహార సంస్థతో పాటు సంబంధిత సంస్థల అవసరాలు, ధాన్య నిల్వకు ఉన్న డిమాండ్, నిల్వ సామర్థ్యం, భౌగోళిక అనుకూలతలను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భారత ఆహార సంస్థ అధికారుల పరిశీలన అనంతరం గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన ప్రాంతాల్లో గోదాముల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్దేశిత నిల్వ సామర్థ్య లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. పీఏసీఎస్‌లను బలోపేతం చేయడంతో పాటు ధాన్య నిల్వ, సేకరణ, మార్కెటింగ్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి రైతులకు మరింత ప్రయోజనం కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అంబదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, అదనపు డీఆర్‌డీఓ సరస్వతి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్యతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, సమయపాలనతో విధులు నిర్వహించాలి: డీఎస్పీ ప్రసన్న కుమార్





మెదక్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ (మెదక్ ప్రతినిధి): విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, అప్రమత్తతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన వారాంతపు పోలీసు పరేడ్‌ను ఆయన పరిశీలించి, పరేడ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది నుంచి సెల్యూట్ స్వీకరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి అధికారి, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా, అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. నేరాల నియంత్రణతో పాటు నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని, పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచేలా వృత్తిపరమైన నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రతి పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. పోలీసు పరేడ్‌లు సిబ్బందిలో క్రమశిక్షణతో పాటు ఐక్యత, బాధ్యతాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు

సంగారెడ్డి, ఆగస్టు 30, సందేశం టైమ్స్: విద్యార్థులకు చదువుతోనే మంచి భవిష్యత్తు లభిస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పటేల్ క్రాంతి జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలల పనితీరు, విద్యార్థుల అభ్యసన స్థాయిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు ఇతర శాఖల నుంచి ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని కలెక్టర్ పటేల్ క్రాంతి జైన్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

నర్సాపూర్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ ప్రతినిధి: నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పట్నం లావణ్య (32) ఇంట్లో విద్యుత్ వైర్లు ఇనుప తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురైనట్లు సమాచారం. ఈ ఘటనలో లావణ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు స్థానికులు తెలిపారు. లావణ్య మృతితో పెద్ద చింతకుంట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ప్రమాదానికి దారితీసిన కారణాలపై అధికారిక సమాచారం తెలియాల్సి ఉంది.



## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

మెదక్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ (మెదక్ ప్రతినిధి): ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, నోటీసుల జారీ, ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్షించారు. మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ క్యాంప్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల సమగ్ర సవరణలో భాగంగా నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టడంతో పాటు సంబంధిత రికార్డుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేసి, నోటీసులు అందజేసిన రోజు నుంచి ఏడు రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని ఆదేశించారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, క్లెయిమ్స్, అభ్యంతరాల సమయంలో సంబంధిత వ్యక్తులు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేసి, సంబంధిత వివరాలను యాప్‌లో నవీకరించినట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని సీఈఓకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ ఆర్డీవో రమాదేవి, ఎన్నికల సూపరింటెండెంట్ గఫార్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలకు యూడీఐడీ కార్డు తప్పనిసరి: సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ శివదయాల్

మెదక్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ (మెదక్ ప్రతినిధి): దివ్యాంగుల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సౌకర్యాలు సులభంగా అందేందుకు యూనిక్ డిజెబిలిటీ ఐడీ (యూడీఐడీ) కార్డు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ శివదయాల్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శనివారం దివ్యాంగుల కోసం యూడీఐడీ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి మొత్తం 175 స్లాట్లు కేటాయించగా 147 మంది దివ్యాంగులు హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో లోకోమోటర్ డిజెబిలిటీ విభాగానికి 66 మంది, జనరల్ మెడిసిన్‌కు 26 మంది, కంటి వైద్య విభాగానికి 18 మంది, ఈఎన్‌టీ విభాగానికి 20 మంది, సైకియాట్రీకి 12 మంది, పీడియాట్రిక్స్ విభాగానికి ఐదుగురు హాజరయ్యారు. శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన వైద్యులు దివ్యాంగులను పరీక్షించి, వారి వైకల్య శాతాన్ని నిర్ధారించే ప్రక్రియను నిర్వహించారు. అర్హులైన వారికి యూడీఐడీ కార్డుల జారీకి అవసరమైన ప్రక్రియను పూర్తి చేశారు. దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ సౌకర్యాలను సులభంగా పొందేందుకు యూడీఐడీ కార్డు ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతి దివ్యాంగుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు.



## మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి నివాసంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం

సంగారెడ్డి, ఆగస్టు 30, సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కొండల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడారు. శ్రీ సత్యనారాయణ స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగేష్ కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, స్థానిక నాయకులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



## మెదక్ జిల్లా కార్మికుల సమస్యలపై కార్మికశాఖ నిర్లక్ష్యం సీఐటీయూ

మెదక్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ (మెదక్ ప్రతినిధి): మెదక్ జిల్లా కార్మికుల సమస్యల పరిష్కారంలో కార్మికశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం ఆరోపించారు. శనివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని డీసీఎల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కార్మికశాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ మెదక్ జిల్లాలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డీసీఎల్‌కు అనేక వినతిపత్రాలు సమర్పించినప్పటికీ యాజమాన్యాలకు సకాలంలో నోటీసులు జారీ చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. చిన్నశంకరంపేట మండలంలోని కావేరి పరిశ్రమలో కనీస వేతనాలు అమలు చేయాలని మార్చి 26న వినతిపత్రం ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారానికి సరైన చర్యలు తీసుకోలేదన్నారు. జాయింట్ సమావేశాల పేరుతో తేదీలు కేటాయించి పలుమార్లు వాయిదా వేస్తున్నారని, అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డీసీఎల్ కార్యాలయం నుంచి యాజమాన్యాలకు పాత అధికారుల పేర్లతో లేఖలు జారీ అవుతున్నాయని, వాటిని యాజమాన్యాలు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. ఈ నెల 12న ఐఎంఎల్ డిపోకు సంబంధించిన సమస్యపై దరఖాస్తు చేసినప్పటికీ ఇప్పటివరకు జాయింట్ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మెదక్ జిల్లా కార్మికులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. కార్మికశాఖ అధికారులు వెంటనే స్పందించి మెదక్ జిల్లా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కావేరి పరిశ్రమకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.




## క్రీడలు, మాతృభాష, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన

నాగులవంచ, ఆగస్టు 30, సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ శెట్టి సురేష్: నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవం, మొక్కలు నాటే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. నవీన్ బాబు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు అధ్యాపకులు సి.హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషను వ్యవహారిక భాషగా అభివృద్ధి చేయడంలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు మాతృభాషపై అభిమానం పెంపొందించుకొని నిత్య జీవితంలో తెలుగును విస్తృతంగా ఉపయోగించాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రిన్సిపాల్ పి. నవీన్ బాబు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి జి. మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు వరప్రసాద్, ఆయూబ్, కృష్ణార్జున, రాంబాబు, నాగేశ్వరరావు, ఐలేశ్వర్, ఉష, చరణ్, అల్లి విజయ్, వెంకటరెడ్డి, వీరాంజనేయులు తదితరులు పాల్గొనగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



## సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నిరసనలు: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ ప్రతినిధి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె ప్రకటించారు. శనివారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. గడిచిన 30 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆమె అన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

నర్సాపూర్, ఆగస్టు 30, సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రముఖ భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని విష్ణు ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాలలో గత వారం రోజులుగా వివిధ క్రీడా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల వంటి లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, రమేష్‌తో పాటు ఇతర ఉపాధ్యాయుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

## బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్.. మహిళ మృతి



నర్సాపూర్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామంలో బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పట్నం లావణ్య (30) మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లావణ్య బట్టలు ఉతికి ఆరవేసేందుకు ఇంటి పక్కనే ఉన్న పశువుల షెడ్డు వద్దకు వెళ్లింది. బట్టలు ఆరవేసేందుకు షెడ్డు సిమెంట్ స్తంభాలకు ఇనుప వైరుతో దండెం ఏర్పాటు చేసి ఉండగా, షెడ్డు లోపల వెలుతురు కోసం ఇంటి నుంచి విద్యుత్ వైర్‌ను ఏర్పాటు చేశారు. అయితే విద్యుత్ వైరు తెగి ఇనుప దండెంకు తగిలిన విషయాన్ని గమనించని లావణ్య బట్టలు ఆరవేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఆమెను వెంటనే కాపాడే అవకాశం లేకపోయిందని స్థానికులు తెలిపారు. మృతురాలికి 12 ఏళ్ల కుమారుడు, 8 ఏళ్ల కుమార్తె ఉన్నారు. లావణ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతుండగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో స్పష్టమైన మార్పు రావాలి

సూర్యాపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో తప్పనిసరిగా స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పే విధానాన్ని సహించేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భూములకు సంబంధించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, చట్ట నిబంధనలను పాటిస్తూనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ లాగిన్‌లో భూములకు సంబంధించిన 45 దరఖాస్తులు ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని మంత్రి ప్రస్తావిస్తూ సంబంధిత తహసీల్దార్ నుంచి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. అవసరం లేని పత్రాలు, ప్రక్రియల పేరుతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, చిన్న సమస్యల పరిష్కారానికి కూడా రోజుల తరబడి వేచి ఉండేలా చేయడం వంటి విధానాలకు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సేవా దృక్పథంతో పరిష్కరించాలని, రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి సంతృప్తితో తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత చేపట్టిన రీ-సర్వేను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, డిసెంబర్‌లో రెండో విడత రీ-సర్వేకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆదేశించారు. తొలి విడతలో రీ-సర్వే జరుగుతున్న 70 గ్రామాల్లో గ్రామ సరిహద్దులను పక్కాగా నిర్ధారించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఆర్డీవోలు, తహసీల్దార్లు గ్రామసభలకు హాజరై పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. సర్వే జరిగిన రోజే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో నవీకరించాలని, సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే పక్క మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు. విధులకు హాజరుకాని లైసెన్స్డ్ సర్వేయర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలోని ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా 15 రోజుల్లో ఎల్-3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. తొలి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను దసరాలోపు పూర్తి చేయాలని, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణాలను గుర్తించి 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్ని పన్నులు, రవాణా చార్జీలు కలుపుకొని రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా ప్రభుత్వం సిమెంట్ కంపెనీలతో నిర్ణయం తీసుకుందని తెలిపారు. లబ్ధిదారులకు సమీప ప్రాంతాల్లో ఇసుక అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో ఇంటి పట్టాల కోసం భూములను గుర్తించినప్పటికీ ఇంకా పంపిణీ చేయని వాటిని గుర్తించి జాబితా రూపొందించాలని, అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలకు పరిష్కారం చూపడమే రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యతగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## tjwa.in సీనియర్ జర్నలిస్టులకు TJWA ఘన సన్మానం.. త్వరలో కోదాడలో ప్రత్యేక కార్యక్రమం

# సూర్యాపేట జిల్లా TJWAలో నూతన బాధ్యతలు స్వీకరించిన జర్నలిస్టులు

సూర్యాపేట, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (TJWA)లో పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు నూతన బాధ్యతలు స్వీకరించారు. TJWA సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షులుగా కంభంపాటి సోమయ్య (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్), కోదాడ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా కొండపల్లి బాబు (సందేశం టైమ్స్ కోదాడ టౌన్ రిపోర్టర్), రాష్ట్ర సభ్యులుగా కొండపల్లి క్రాంతికుమార్, రాష్ట్ర సలహాదారులుగా వీజే నాయుడు (గరుడా మీడియా సీఈఓ), రాష్ట్ర సభ్యులుగా కుంచెపు సురేష్ (సందేశం టైమ్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్) బాధ్యతలు స్వీకరించారు. TJWA జాతీయ అధ్యక్షులు శెట్టి అశోక్, జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్, కోశాధికారి కాసే అమృత ఆధ్వర్యంలో వీరంతా తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా TJWA జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం TJWA నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో ప్రతి మండలం నుంచి 10 మంది చొప్పున సీనియర్ రిపోర్టర్లను గుర్తించి, త్వరలో TJWA ఆధ్వర్యంలో శాలువా, షీల్డులతో ఘనంగా సన్మానించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను ఆహ్వానించడంతో పాటు హాజరయ్యే జర్నలిస్టులకు భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండి సంఘటితంగా ముందుకు సాగాలని, వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి పరస్పరం సహకరించుకోవాలని ఆయన సూచించారు. తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందాలనుకునే రిపోర్టర్లు నేరుగా గూగుల్‌లో tjwa.in అని వెతికి, వెబ్‌సైట్‌లోని "Apply for Membership" ఎంపిక ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయిన అనంతరం సుమారు ఐదు నిమిషాల్లో డిజిటల్ సభ్యత్వ కార్డు అందేలా సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. TJWA ద్వారా జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను చేపట్టడంతో పాటు, జర్నలిస్టులకు ఎలాంటి అన్యాయం జరిగినా వారి తరఫున చట్టబద్ధమైన, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడేందుకు సంఘం ముందుంటుందని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, భద్రత, సంక్షేమం కోసం ఐక్య వేదికగా TJWA పనిచేస్తుందని, వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులు సంఘంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరస్పర సహకారంతో పరిష్కరించుకుంటూ, సమాజానికి బాధ్యతాయుతమైన పాత్రికేయ సేవలు అందించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. TJWAలో సభ్యత్వం పొందేందుకు ఆసక్తి ఉన్న జర్నలిస్టులందరికీ సంఘం తరఫున ఆహ్వానం పలికారు.



# రెండో రోజు కొనసాగిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీ

హైదరాబాద్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద ఇళ్ల కేటాయింపునకు చేపట్టిన లాటరీ ప్రక్రియ రెండో రోజు కూడా విజయవంతంగా కొనసాగింది. శనివారం ఖైరతాబాద్, కూకట్‌పల్లి, బహదూర్‌పుర, అంబర్‌పేట నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఇళ్లకు సంబంధించి 1,920 ఇళ్లను లాటరీ ద్వారా కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వివిధ ఫంక్షన్ హాళ్లలో అధికారులు, దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్మించనున్న ఇళ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులు స్వీకరించగా, ప్రాథమిక అర్హతలను పరిశీలించిన అనంతరం అర్హులైన దరఖాస్తుదారులను లాటరీ ద్వారా ఎంపిక చేసి ఇళ్ల కేటాయింపు చేపడుతున్నారు. ఆగస్టు 28 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ఈ లాటరీ ప్రక్రియను శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా రెండో రోజు లాటరీ ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. మూడో రోజు ఆగస్టు 30న శేరిలింగంపల్లి, మలక్‌పేట, మేడ్చల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు సంబంధించిన లాటరీ నిర్వహించనున్నారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారని, దరఖాస్తుల స్వీకరణ సమయంలో ధ్రువపత్రాలు తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులు సమర్పించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించేందుకు ఈ పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే వాటిని తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అర్హులైన వారికే ఇళ్ల కేటాయింపు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రక్రియపై ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావు లేదని వి.పి. గౌతమ్ స్పష్టం చేశారు.

## ప్రాణహిత పునరుజ్జీవనానికి కీలక ముందడుగు.. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల బ్యారేజీకి తెలంగాణ పట్టు

హైదరాబాద్, ఆగస్టు 30 (సందేశం టైమ్స్): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పునరుజ్జీవింపజేసి తెలంగాణ రైతాంగానికి అసలు పథకంలో ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలకంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే తెలంగాణ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను భారీ ఎత్తిపోతల అవసరం లేకుండా సహజ గురుత్వాకర్షణ ద్వారా సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని, తద్వారా విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ–మహారాష్ట్ర మధ్య జరగనున్న కీలక అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం మంత్రి ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓ.వి. రమేష్‌బాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఢిల్లీలో జరగనున్న సమావేశంలో తెలంగాణ తరఫున వినిపించాల్సిన సాంకేతిక, న్యాయపరమైన అంశాలు, 152 మీటర్ల బ్యారేజీ వల్ల కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గురుత్వాకర్షణ ద్వారా నీటి తరలింపు సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా చర్చించారు. సెప్టెంబర్ 1న జరిగే అంతర్రాష్ట్ర సమావేశానికి కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షత వహించనున్నారని, తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు సీడబ్ల్యూసీ కీలక విభాగాల అధికారులు పాల్గొంటారని మంత్రి తెలిపారు. గతంలో 148 మీటర్ల స్థాయికి అంగీకరించడానికి బదులుగా 152 మీటర్ల స్థాయిలో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. సాంకేతిక అధ్యయనాల ప్రకారం 148 మీటర్ల స్థాయిలో మహారాష్ట్ర భూభాగంలో సుమారు 1,150 ఎకరాలు, 152 మీటర్ల స్థాయిలో 2,500 ఎకరాలకు పైగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ముంపు అంశంపై మహారాష్ట్రతో చర్చలు అనివార్యమైన నేపథ్యంలో తెలంగాణకు గరిష్ఠ సాంకేతిక ప్రయోజనం కలిగించే 152 మీటర్ల స్థాయికి సమ్మతి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణం సాధ్యమైతే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను సహజ గురుత్వాకర్షణతో సుందిళ్ల వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని, భారీ ఎత్తిపోతల వ్యవస్థలపై ఆధారపడటం తగ్గడంతో పాటు ఏటా విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం తగ్గుతుందని వివరించారు. 1975, 1978 అంతర్రాష్ట్ర ఒప్పందాలు ప్రాణహిత ప్రతిపాదనకు బలమైన న్యాయ, సంస్థాగత పునాదిగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. అసలు ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి పథకం సుమారు 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూపుదిద్దుకుందని, అనంతరం జరిగిన పునరాకల్పన, పునర్వ్యవస్థీకరణలో అసలు ప్రతిపాదిత ఆయకట్టులోని గణనీయమైన ప్రాంతాలు సాగునీటి ప్రయోజనాలకు దూరమయ్యాయని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దాదాపు రెండు లక్షల ఎకరాలకు సమర్థమైన సాగునీటి వనరు లేకుండా పోయిందని, ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని చివరి ఆయకట్టు ప్రాంతాలు కూడా అసలు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయని పేర్కొన్నారు. పునరాకల్పనలో కీలక ప్యాకేజీలు తొలగిపోవడంతో ఆయా ప్రాంతాలు తమకు ఉద్దేశించిన సాగునీటి వనరును కోల్పోయాయని అన్నారు. ప్రస్తుత ప్రాణహిత పునరుజ్జీవన ప్రణాళిక కేవలం తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికే పరిమితం కాదని, సాగునీటి ప్రయోజనాలు కోల్పోయిన ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి ప్రాంతాలకు అసలు ప్రాజెక్టులో కల్పించిన జల ప్రయోజనాలను తిరిగి అందించడమే విస్తృత లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1న జరిగే సమావేశంలో ప్రతిపాదిత బ్యారేజీ స్థాయి, ముంపు ప్రభావం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు, పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. మహారాష్ట్రతో సానుకూల, నిర్మాణాత్మక చర్చలు జరుపుతూనే తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నదీజల ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.